క్లుప్తంగా

కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్: మండలానికి చెందిన బీఎస్పీ నాయకులు ఆదివారం కాంగ్రెస్‌లో చేరగా, సిరిసిల్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఎస్పీ మండల అధ్యక్షుడు నవీన్‌తోపాటు ఇరవై మంది నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఆరు గ్యారంటీల అమలు, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో చేస్తున్న అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరుతున్నారని మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఎంపీటీసీ గుండెల్లి శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు గజ్జెల రాజు, మహేశ్‌రెడ్డి, కరుణాకర్,కుమార్, కుడుకల మల్లేశ్ తదితరులున్నారు.

ఆలయంలో పూజలు



వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

చందుర్తి: మండలంలోని మల్యాల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో బీజేపీ నాయకులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. కరీంనగర్ బీజేపీ పార్టీ అభ్యర్థి బండి సంజయ్ గెలవాలని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పత్తిపాక శ్రీనివాస్, చెన్నమనేని మదన్‌రావు, లోకోజి సతీశ్ కుమార్, పాటి సుధాకర్, జక్కని రాజేశం, పత్తిపాక మల్య, గొల్లపల్లి సాయికృష్ణ, మోత్కుపల్లి మధు, పొంచెట్టి తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

'ఉర్సు'కు రావాలని ఆహ్వానం



రవీందర్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని సింగారం గ్రామ శివారులో దర్శాల గుట్టపై ఉన్న దుర్వేషాలి దర్గా ఉర్సు ఉత్సవాలకు రావాలని కోరుతూ ఆదివారం మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారికి నిర్వాహకులు షేక్ అజీజ్ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఉర్సు ఉత్సవాలు ఈనెల 15న ప్రారంభం కానున్నాయి. ముస్లిం కమిటీ మండల అధ్యక్షుడు షేక్ షాదుల్లా, నాయకులు డాక్టర్ హైమద్, జహంగీర్, లాల్ మహమ్మద్, ముజాఫర్, అహమ్మద్ తదితరులున్నారు.

వార్షికోత్సవ వేడుకలకు ముస్తాబు



ఆలయంలో అమ్మవారు

ముస్తాబాద్: మండలంలోని కొండాపూర్‌లో చౌడాలమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలకు ఆలయ ముస్తాబైంది. ఈనెల 14 నుంచి 18 వరకు ఆలయంలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు శ్రీ కృష్ణయాదవ సంఘం నాయకులు తెలిపారు. ఒగ్గకథ, అమ్మవారి కల్యాణం, పోచమ్మ, చౌడాలమ్మ బోనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున ఉత్సవాల్లో పాల్గొనాలన్నారు.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న భూపతిరెడ్డి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బండలింగంపల్లికి చెందిన కొండె భూపతిరెడ్డిని బీజేపీ యువమోర్చా మండల సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమించారు. ఈ మేరకు ఆదివారం నియామకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ బండి సంజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, కుమార్‌యాదవ్‌కు భూపతిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఓటేద్దాం రండి..

- ఓటు.. బంగారు భవిష్యత్‌కు బాట
- బాధ్యతగా గుర్తించి ప్రతిఒక్కరూ ఓటు వేయాలి
- ఓటుహక్కుపై పలువురి అభిప్రాయం

సిరిసిల్లటౌన్: ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. పౌరు హక్కుల సాధనకు సరైన సమయం. దేశపౌరులు అందరూ ఓటు వేయాలి..అప్పుడే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది.. నిజమైన నాయకత్వం చట్టసభల్లో కొలువై దేశ పౌరులకు మౌలిక వసతులు కల్పించగలుగుతుంది. అందుకు ఓటుహక్కు ఉన్న ప్రతి పౌరుడు తమ ప్రాథమిక హక్కును వినియోగించుకోవాలని పెద్దలు (సీనియర్ సిటిజన్స్) అభిప్రాయపడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో వందశాతం ఓటింగ్‌కోసం 'సాక్షి'తో అభిప్రాయాలు ఇలా ఉన్నాయి.





ఓటుహక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రతి ఎన్నికల్లో ఓటేశా..



సుమారు యాభై ఏళ్ల నుంచి ప్రతి ఎన్నికల్లో నేను ఓటు వేస్తున్న. ఏనాడూ వేయకుండా ఉండలేదు. ఏదైనా ఎన్నికల సమయంలో వేరే ఊళ్లకు వెళ్లినా వచ్చి ఓటు వేసిన రోజులున్నాయి. ఆరోజుల్లో నాయకులు, వారికి ప్రజాసేవలో ఉన్న సామర్థ్యంపై ప్రాధాన్యం ఇచ్చేవారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు ప్రధానాస్త్రం, నేను 2004లో రిటైర్డ్ అయిన. పోస్టల్ బ్యాలెట్‌తో కూడా ఓటేసిన. ఒకప్పటికీ ఇప్పటి ఎన్నికలకు వ్యత్యాసం ఉంది. ఓటు పౌరుల ప్రాథమిక హక్కు. ఖచ్చితంగా వినియోగించుకోవాలి. వందశాతం పౌరులు ఓటువేస్తే..అందరు మెచ్చే సర్కారు ఏర్పాటు తథ్యం. ప్రజా శ్రేయస్సుకు పనిచేసే వారికి ఓటేస్తే సమాజం బాగుపడుతుంది. దేశాభివృద్ధికి ఓటు అస్త్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– గుద్ల లీలారాణి, రిటైర్డ్ హిందీ పండిట్

గడీల బడిలో ఓటేసిన..



మొదటి ఓటును సిరిసిల్ల గడీల బడిలో వేసిన. అప్పట్లో మావారు రాజయ్య సార్ ఓబులాపురంలో టీచర్‌గా చేసేవారు. ఎన్నికలు రావడంతో సవారి కచ్రంలో వచ్చి ఓటు వేశాను. ఇప్పటిలెక్క ప్రచారా ఆర్భాటాలు లేవు. తక్కువ పార్టీలు బరిలో ఉండేవి. ఎన్నికల ప్రచారం బుర్రకథల ద్వారా చేసేవారు. ఓటర్లు ఇప్పటోళ్లంత తెలివిగా లేకుండు. ఇప్పుడు ఓటర్లలో చైతన్యం ఎలిగెత్తింది. ఏ ఎన్నికల్లో కూడా ఓటు వేయకుండా ఉన్నది లేదు. ఓటును అమ్ముకోవద్దు. దేశాభివృద్ధినే నమ్ముకోవాలి. ఓటర్లు వందకు వంద శాతం ఓటు వేయాలి. ప్రజాసేవకు అంకితమైన నాయకులను గుర్తించి నిజాయతీతో ఓటువేయాలి.

– ప్రయాకర్‌రావు లక్ష్మి, ఫ్యామిలీ పెన్షనర్

ఆలోచించి వేయాలి



ప్రజాస్వామ్యంలో ఎన్నికల రోజు అనేది అతిపెద్ద పండుగ. అప్పట్లో ఎన్నికలంటే ప్రజల్లో సంతోషం ఉండేది. తాము కోరుకున్న నాయకుల కోసం స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొనేవారు. నియోజకవర్గం మొత్తంలో రెండు, మూడు జీబులు ప్రచారానికి తిరిగేవి. ఎన్నికల కమిషన్ పటిష్ట నిబంధనలతో ఇప్పుడు ప్రతి అభ్యర్థి ఖర్చులు చూపించాల్సి ఉంది. గెలిచినా, ఓడిన అభ్యర్థులు ఇద్దరూ స్నేహితత్వాన్ని కొనసాగించేవారు. దేశానికి ఎవరి నాయకత్వం కావాలో ఆలోచించి ఓటువేయాలి. ఓటుహక్కు బాధ్యతగా గుర్తించాలి. మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసే సరైన నాయకులను ఎన్నుకోవాలి. లేదంటే ఐదేళ్లు ఇబ్బంది పడుతాం.

– మాణికరావు లక్ష్మీ నారాయణ, రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్



చెరువులోకి మురుగునీరు

గంభీరావుపేట: గంభీరావుపేట మండలకేంద్రంలోని వెంకటాద్రి చెరువు నీరు కలుషితమవుతోంది. గ్రామంలోని డ్రైనేజీ నీరంతా చెరువులోకి చేరుతోంది. గతంలో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో నీరంతా చెరువులోకి వెళ్తోంది. దీంతో నీరంతా వ్యర్థాలతో నిండిపోయి పశువులు సైతం తాగేందుకు వీల్లేకుండా ఉంటుంది. అధికారులు స్పందించి చెరువులోకి మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

గంభీరావుపేట: ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులు దోస్త్ ద్వారా డిగ్రీలో ప్రవేశం పొందాలని గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ వి. విజయలక్ష్మి కోరారు. ఆన్‌లైన్‌లో దోస్త్‌లో గంభీరావుపేట కళాశాలను మొదటి ప్రాధాన్యంగా ఎంపిక చేసుకోవాలని సూచించారు. న్యాక్ గుర్తింపు పొందిన కళాశాల, ఎన్‌ఎస్‌ఎస్, సర్టిఫికెట్ కోర్సులు, అధునాతన కంప్యూటర్ ల్యా బ్స్, విశాలమైన లైబ్రరీ, ప్రొజెక్టర్ ద్వారా విద్యాబోధన, టాస్క్ ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు, ఉ ద్యోగ నైపుణ్య శిక్షణలాంటి ప్రత్యేకతలతో కళాశాల కొనసాగుతుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

పాత కక్షలతో దాడి

గంభీరావుపేట: పాత కక్షలు, ఫర్నిచర్ దుకాణ విషయంలో ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన సంఘటన మండలకేంద్రంలో జరిగింది. ఎస్సై రామ్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన వసీం అక్రంపై ఆయన తండ్రి, సోదరులు ఫర్నిచర్ దుకాణ విషయంలో కత్తి, ఇతర వస్తువులతో దాడి చేసినట్లు ఎస్సై తెలిపారు. వసీం అక్రం భార్య గుల్నాస్ పర్వీన్ ఫిర్యాదు మేరకు బాధితుడి తండ్రి ఆరీఫ్, సోదరులు జావిద్, అన్వర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వృద్ధాశ్రమంలో మదర్స్‌డే వేడుకలు

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి ప్రభుత్వ వృద్ధాశ్రమంలో ఆదివారం మదర్స్ డే సందర్భంగా కేక్ కట్‌చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా వృద్ధులు మాట్లాడుతూ పిల్లలు తల్లిదండ్రులను భారంగా భావించకూడదని వారిపట్ల ప్రేమాభిమానాలతో మెలగాలన్నారు. కార్యక్రమంలో ఆశ్రమం కోఆర్డినేటర్ ఎం.మమత, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ బి.వెంకటేశ్, వృద్ధులు, తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికులపై పట్టింపేది ?

- కార్మికులకు రక్షణ కరువు
- పట్టించుకోని కార్మికశాఖ అధికారులు
- శ్రమ దోపిడీకి గురవుతున్న వైనం



కార్మికుడిపై దాడిచేస్తున్న కాంట్రాక్టర్ కొడుకు (ఫైల్)

వేములవాడరూరల్: ఉన్న ఊరిలో ఉపాధి కరువై వలస వస్తున్న కార్మికులను కొందరు యజమానులు వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో పల్లెలను వదిలి పట్టణానికి వస్తున్న వీరిని ఆసరా చేసుకొని కొంతమంది కాంట్రాక్టర్లు అడ్డాలపై ఒప్పందం మాట్లాడుకొని శ్రమ దోపిడీకి గురిచేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కొందరు కాంట్రాక్టర్లు నెలల తరబడి వారికి రావాల్సిన వేతనాలను సకాలంలో చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారన్న విమర్శలున్నాయి. ఈ విషయంలో కొంతమంది కార్మికులు యజమానులను వేతనాలు ఇవ్వాలని కోరగా వారిపైనే దాడులకు పాల్పడుతున్నారని, ఇలాంటి ఘటనలు ఈ మధ్య వేములవాడ అర్బన్, రూరల్ మండలంతో పాటు పట్టణంలో తరచూ జరుగుతున్నట్లు తెలిసింది. ఈ విషయంపై పోలీస్ అధికారులు, సంబంధిత కార్మికశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణ లున్నాయి. కార్మికులు వారికి జరిగిన అన్యాయంపై ప్రశ్నించలేక, ఫిర్యాదు చేయలేక యజమాని చేతిలో బలవుతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా కార్మికశాఖ అధికారులు ప్రత్యేక దృష్టిసారించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కార్మికుల కోసం పోరాడుతా



కార్మికులకు అన్యాయం జరిగితే కార్మికుల పక్షాన నిలబడతాం. కార్మికులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తాను. ఏ పార్టీలు, ఎవరికీ తొత్తుగా మారకుండా వారికి న్యాయం జరిగేలా చూస్తా.

– కదారి రాములు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

చర్యలు తీసుకోవాలి



ఇతర గ్రామాల నుంచి వచ్చే కార్మికులకు అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత కాంట్రాక్టర్లపై ఉంది. కానీ వారిపైనే దాడులు చేస్తే కార్మిక చట్టాల ప్రకారం ఎంతటి వారైనా కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకుంటాం. దీనిపై లేబర్ ఆఫీసర్ కూడా స్పందించి కార్మికుడికి న్యాయం చేయాలి.

– ఎగమంటి ఎల్లారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు

వేతనాలు ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటాం

కార్మికులపై దాడులు చేస్తే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. కార్మికులకు వేతనాలు ఇవ్వకపోతే విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటాం. కాంట్రాక్టర్లు దాడులు చేసినా క్రిమినల్ కేసులకు లేబర్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధం లేదు. ఒకవేళ ఏదైనా ఫిర్యాదులు వస్తే విచారణ జరుపుతాం.

– ఎండీ రఫీ, లేబర్ ఆఫీసర్, సిరిసిల్ల

దాడులు జరిగితే ఫిర్యాదు చేయాలి

కార్మికులపై ఎవరూ దాడులు చేసే హక్కులేదు. ఎక్కడైనా దాడులు జరిగితే నిర్భయంగా ఫిర్యాదు చేయాలి. ఎవరైనా, ఏ పార్టీ అయినా చర్యలు తీసుకుంటాం. ఇలాంటి సంఘటనలు జరిగినట్లు తమ దృష్టికి వస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

– వీరప్రసాద్, సీఐ, వేములవాడ

పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



బోయినపల్లి పోలింగ్‌స్టేషన్ ఎదుట అభ్యర్థుల జాబితాను అంటిస్తున్న సిబ్బంది



కోనరావుపేట: ఎగ్లాస్‌పూర్‌లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం



ముస్తాబాద్: పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తు



వీర్నపల్లి: ఎన్నికల సామగ్రితో పోలింగ్ సిబ్బంది



రుద్రంగి: పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సామగ్రి సిద్ధం చేసుకుంటున్న పోలింగ్ సిబ్బంది



ఎల్లారెడ్డిపేట: జెడ్పీ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో సిబ్బంది, అధికారులు

వేములవాడఅర్బన్: వేములవాడ అర్బన్ మండలంలోని గ్రామాల్లో సోమవారం పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సిబ్బంది సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట, తంగళ్లపల్లి మండలాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రితో పో సిబ్బంది చేరుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధం చేశారు. మండలంలోని 24 గ్రామాల పరిధిలో 40,350 మంది ఓటర్లు ఉండగా, 43 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మహిళా ఓటర్లు 20,901, పురుషులు 19,449 మంది ఉన్నారు. పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన సిబ్బంది ఆయాకేంద్రాలకు చేరుకొని ఓటర్ల జాబితాను కేంద్రాల ముందు అతికించారు. ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఉన్నతాధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అర్హులైన వారు ఓటుహక్కు వినియోగించుకోవాలని, ఎన్నికల నిర్వహణకు బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

రుద్రంగి: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది కేంద్రాలకు చేరుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు.

కోనరావుపేట: మండలంలోని 28 గ్రామాల్లో 43 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అన్ని గ్రామాల్లోని కేంద్రాల్లో తాగునీటి వసతి, లైట్లు, టెంట్లు తదితర వసతులు కల్పించారు. మండలంలోని ఎగ్లాస్‌పూర్‌లోని పోలింగ్‌కేంద్రాన్ని మోడల్ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేశారు.

బోయినపల్లి : మండలంలోని 23 గ్రామాల్లో 41 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొదురుపాక, నీలోజిపల్లి గ్రామాలను క్రిటికల్ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు పలు పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్, మెజార్టీ పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాల ద్వారా నిఘా ఉంటుందని అధికారులు తెలిపారు. మండలంలో 30,386 మంది ఓటర్లు ఉన్నారు.

ముస్తాబాద్: మండలంలో పార్లమెంట్ ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ సురేశ్, ఎంపీడీవో భాస్కరశర్మ తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ పీవోలు, సిబ్బంది, పోలీసులు పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక బస్సుల్లో చేరుకున్నారు. సమస్యాత్మక కేంద్రాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. 45 కేంద్రాల్లో 38,278 మంది ఓటుహక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామని అధికారులు పేర్కొన్నారు.

వీర్నపల్లి: మండంలోని 16 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. పురుషులు 5,746, మహిళలు 5,890 మొత్తం 11,636 మంది ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. కేంద్ర పోలీస్ బలగాలతో భారీ బందోబస్తు నిర్వహించారు. అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.

చందుర్తి : మండలంలోని 19 గ్రామపంచాయతీలుండగా 33 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఎన్నికల సామగ్రితో సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. పోలింగ్ కేంద్రాలవద్ద ఏర్పాట్లు చేశారు.

పిడుగు పాటుకు ఆవు మృతి



మృతిచెందిన ఆవు

చందుర్తి: మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన పూడూరి మల్లారెడ్డి అనే రైతుకు చెందిన ఆవు ఆదివారం పిడుగుపాటుకు మృతిచెందింది. గ్రామ శివారులోని పశువుల పాకలో మధ్యాహ్నం కట్టేసి ఇంటికి వెళ్లాడు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవగా పిడుగుపాటుకు ఆవు మృతి చెందింది. దీంతో దాదాపు రూ. 80వేల వరకు నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపాడు.

సంఘం అభివృద్ధికి కృషిచేస్తా



నవీన్‌కుమార్



మిర్యాలకార్ చిన్నోజి

ఎల్లారెడ్డిపేట: సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని ఆరె కటిక సంఘం అధ్యక్షుడు నాంతాబాద్ నవీన్ పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట ఆరె కటిక సంఘం నూతన అధ్యక్షుడిగా నవీన్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా మిరియాలకార్ చిన్నోజిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా పవన్, ప్రశాంత్, మహేశ్ నియమితులయ్యారు.

ఘనంగా శంకరాచార్యుల జయంతి



సిరిసిల్లటౌన్: జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతిని సిరిసిల్ల గీతాప్రచార సమితి ఘనంగా నిర్వహించింది. విశ్వనాథ ఆలయంలో ఉదయం నుంచి రాత్రి వరకు సామూహిక భగవద్గీత పారాయణం, గీతాగోవిందం మూడవతే శ్లోకాల పారాయణం, ప్రవచనాలు ఆలపించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొనగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమితి అధ్యక్షుడు కోడం నారాయణ, ప్రధాన కార్యదర్శి జనపాల శంకరయ్య, ఎల్లయ్య, దూస శ్రీనివాసులు, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ పోలీసుల తనిఖీలు

ఎల్లారెడ్డిపేట: జిల్లా వ్యాప్తంగా సోమవారం ఎన్నికలు ఉండడంతో ఎస్పీ అఖిల్ మహాజాన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఎల్లారెడ్డిపేట మండలంలో స్పెషల్ పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. మండలంలోని పలు గ్రామాల్లో తనిఖీలు చేస్తూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా వ్యాపార సముదాయాలను మూసివేయించారు. 144 సెక్షన్ అమలులో ఉందని ఎస్పీ పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట: రాచర్ల గొల్లపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు పాటి దేవయ్య తల్లి పాటి నర్సవ్వ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, నాయకులు అందే సుభాష్, రమేశ్, బాలయ్య, సురేశ్ ఉన్నారు.